అడవిలో మంటలను అరికట్టాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: అడవిలో మంటలను అరికట్టాలని చింతపల్లి డివిజన్ అటవీ శాఖ అధికారి సిహెచ్. సూర్యనారాయణ పడాల్ తెలిపారు. శనివారం అటవీ సిబ్బందితో కలిసి వన్య మృగాల సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, అడవి మంటలపై బోర్డులను జి.మాడుగుల నుంచి చింతపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో అన్నవరం అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎస్. వెంకటరావు, ఎఫ్‌బీవో శ్రీనివాస ప్రసాద్, ఏబిఓ జె.దివ్య పాల్గొన్నారు.

అడవిని పరిశీలిస్తున్న డివిజన్ అధికారి

మండలి పోరుకు సర్వం సిద్ధం

-ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికలకు దాదాపు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలల్లోపు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంటింటికి ఓటరు స్లిప్పులను అందిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది కోసం 7 ఆర్‌టిసి బస్సులు సిద్ధం చేశారు. సార్వత్రిక ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ ఎన్నికలకు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ఆ మేరకు అధికారులు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పాడేరు డివిజన్ 11 మండలాల్లో 11,525 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 7861 మంది, మహిళలు 3661 మంది, ఇతరులు ముగ్గురు ఓటర్లు ఉన్నారు. అందుకుగాను 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయనున్నారు. పాడేరు డివిజన్‌కు గాను తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో (బాలురు) డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ స్వర్ణభారతి ఓట్ల లెక్కింపు కేంద్రంలో తరలించేంత వరకు తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలోనే (బాలురు) కట్టుదిట్టమైన భద్రతతో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశారు. మొత్తం 5 జోన్లు, 5 రూట్లను ఏర్పాటు చేశారు. ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, జెసి శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సాల్, డ్వామా పిడి రమేష్ రామన్, డిఆర్ డిఎ పిడి వి.మురళిలను ఆయా జోన్/రూట్ లకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. డిఇఒ, ఉద్యానవన ఎపిడి పవన్ కుమార్, జిల్లా కోపరేటివ్ అధికారి ఎంవి.కృష్ణంరాజు, చింతపల్లి డ్వామా ఎపిడి ఎల్.రామారావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్‌లను జోన్‌ల అధికారులుగా, అనంతగిరి ఆర్ డబ్ల్యుఎస్ డిఇఇ ఎం.జయరాం, పెదబయలుకు ఆర్ డబ్ల్యుఎస్ డిఇఇ డి.గోపాలక్రిష్ణ మూర్తి, చింతపల్లి ఆర్ డబ్ల్యుఎస్ డిఇఇ జిఆర్.రాజు, చింతపల్లి టిడబ్ల్యు డిఇఇ చాణుక్యలను రూట్ అధికారులుగా నియమించారు. పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు, సూక్ష్మ పరిశీలకులను నియమించారు. పోలింగ్ రోజున ఎలాంటి వాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

ఓటు హక్కు వినియోగానికి గుర్తింపు కార్డులు ఇవే..

పాడేరుటౌన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు తప్పనిసరిగా తమ ఎపిక్ కార్డును తీసుకు వెళ్లాలని సూచించారు. ఎపిక్ కార్డు లేని ఓటరు ఎన్నికల సంఘం సూచించిన ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకు వెళ్లి ఎన్నికల సిబ్బందికి చూపించి తమ ఓటును పొందవచ్చన్నారు.

ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులు

ఆధార కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డ్, . ఇండియన్ పాస్ పోర్ట్ , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ అండర్ టేకింగ్ కంపెనీలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రవేట్ పారిశ్రామిక సంస్థలు సిబ్బందికి జారీ చేసిన సర్వీస్ గుర్తింపు కార్డు, ఎంపి, ఎంఎల్ఎ, ఎంఎల్‌సి లకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డ్, సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గంకు చెందిన ఓటర్లను నియమించే విద్యా సంస్థల ద్వారా జారీ చేయబడ్డ సర్వీస్ ఐడెంటిటీ కార్డు, విశ్వవిద్యాలయం జారీ చేసిన డిగ్రీ లేదా డిప్లొమా ఒరిజినల్ సర్టిఫికేట్, సంబంధిత అధికారి జారీ చేసిన ఒరిజినల్ శారీరక వైకల్యం సర్టిఫికేట్, భారత ప్రభుత్వ సామాజిక, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక వైకల్యం ఐడి (యుడిఐడి). ఓటరు ఎపిక్ కార్డు లేని వారు పై తెలిపిన 10 రకాల కార్డులలో ఎదో ఒక గుర్తింపు కార్డును చూపించాలని కలక్టర్ కోరారు.

ఏర్పాట్లను సంయుక్త కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు తెలిపారు. శనివారం తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని జేసి సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, ఎన్నికలు సజావుగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్షులు, బ్యాలెట్ పేపర్లతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇతర సామగ్రి జిల్లాకు చేరుకుందని తెలిపారు.ఆదివారం ఉదయం నుండి తలారిసింగి పాఠశాల నుండి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకే పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుంటారని, వీరికి పోలింగ్ కేంద్రం వారీగా ఎన్నికల సామగ్రి అందజేసి సంబంధిత రూట్ అధికారులు కేంద్రాలకు కేటాయించిన వాహనాలలో చేరవేస్తారని జేసి వివరించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు పోలింగ్ అధికారులు చొప్పున (ఒక పోలింగ్ అధికారి, ఒక సహాయ పోలింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు) విధులు కేటాయించటం జరిగిందన్నారు. రిజర్వ్‌తో సహా 36 మంది పోలింగ్ అధికారులు, 36 మంది సహాయ పోలింగ్ అధికారులు, 72 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించటం జరిగిందన్నారు. 18 మంది మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కేస్టింగ్ కు 15 మంది వీడియోగ్రాఫర్లను నియమించటం జరిగిందన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ శివశ్రీనివాస్

జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల వివరాలు..

అంశం	సంఖ్య
పురుషులు	7861
మహిళలు	3661
ఇతరులు	3
మొత్తం ఓటర్లు	11525

మండలాల వారీగా ఇలా..

మండలం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
హుకుంపేట	1714	2
పాడేరు	1440	2
అరకు వ్యాలీ	1819	2
జికె వీధి	440	2
డుంబ్రిగూడ	912	1
అనంతగిరి	633	1
పెదబయలు	1186	1
ముంచింగిపుట్టు	1059	1
చింతపల్లి	1021	1
కొయ్యూరు	664	1
జి.మాడుగుల	637	1

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

'వెలుగు' అవినీతిపై సమగ్ర దర్యాప్తునకు వినతి

ఎపిడి శ్రీనివాస్, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలో వెలుగు శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వెలుగు ఏపీడి శ్రీనివాసు, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు వెలుగుశాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను, వెలుగు పిడిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వినతిపత్రంలోని వివరాలు ఇలా ఉన్నాయి.... రంపచోడవరం డివిజన్ పరిధిలోని మారేడుమిల్లి మండల మహిళా సమైక్య ద్వారా చింతపండు, చీపుర్లు కొనుగోలు చేసి వాటిని విక్రయించగా వచ్చిన మొత్తం సొమ్ముకు ఎటువంటి రికార్డులు, లెక్కలు నిర్వహించలేదు. రంపచోడవరం పరిధిలో నిర్వహిస్తున్న పసుపు యూనిట్ల మిషనరీ కొనుగోలుకు కూడా ఏపిడి శ్రీనివాస్ కమీషన్ తీసుకున్నారు. ఆ యూనిట్ల ద్వారా తయారు చేసిన పసుపునకు ఎంత లాభం వస్తుందో లెక్కలు రికార్డులు లేవు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని ఏపిడి తన చెప్పుచేతుల్లో పెట్టుకొని వారి ద్వారా ప్రతినెల కమీషన్లు తీసుకుంటున్నారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో కూడా అనేక నిధులు దుర్వినియోగం జరిగాయి. ముఖ్యంగా చింతూరు, విఆర్.పురం మండలాల్లో ఉన్నతి, శ్రీనిధి హెచ్డి డబ్బులు మొత్తం దుర్వినియోగం అయ్యాయి. వై రామవరం మండలంలో పని చేస్తున్న హెచ్సిసి బి.నీలవేణి ఆ మండలంలో 6 గ్రామ సమాఖ్యలలో సుమారు రూ.7 లక్షలు సభ్యులకు తెలియకుండా తన సొంత పనులకు వాడుకున్నారు. తిరిగి కట్టమని అడిగిన కట్టడం లేదని ఫిర్యాదు చేయగా, నీలవేణిపై దర్యాప్తు నిర్వహించారు. తప్పు రుజువైనా ఆ సిసి అవినీతి పై ఎటువంటి చర్యలు లేకుండా, ఆమెను రక్షించే చర్యలకు పూనుకున్నారు. వెంటనే సిసి నీలవేణిని సస్పెండ్ చేయాలని, ఆమెకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో చింతూరు మండలం, నిమ్మలగూడెం గ్రామంలో 2017, 2018 సంవత్సరాల్లో శబరి గ్రామ సంఘానికి సంబంధించి విషయంలోనూ అక్రమాలకు పాల్పడిన శ్రీనిధి మేనేజర్ ఎన్. మాధవిలత, సిసి చవలం, బజారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వాక్రా సంఘాల మహిళలను మోసం చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడిన వెలుగు ఏపిడి, సిసిలను సస్పెండ్ చేయడంతో బాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి ఉన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న సిపిఐ, సిపిఎం నాయకులు

విద్యార్థుల మరణాలకు ఐటిడిఎ పిఒ బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ఐటిడిఎ పిఒ బాధ్యత వహించాలని సిపిఐ, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలం కొమ్మిక గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మాతే సువర్ణ మృతి చెందిందని, జిల్లాలో ఇటీవల కాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారు పదిమంది చనిపోయారని తెలిపారు. దీనికి ఐటీడీఏ పీవో నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని అనేక మార్లు చెప్పినప్పటికీ పెడ చెవిటి పెట్టారన్నారు. ఐటిడిఎ పిఒ గిరిజనుల వ్యతిరేకి అని, ఆయన గిరిజనులన్నా, గిరిజనుల పిల్లలన్నా లెక్క లేనట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆశ్రమ పాఠశాలలో చనిపోయిన పిల్లల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని, మెరుగైన వైద్యం అందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి ఎంపీటీసీ ఇరువాడ సత్యవేణి, సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేముడు, నాయకులు దర్శి సతీష్, సిపిఎం కార్యవర్గ సభ్యులు వై.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో సిసి రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-కూనవరం

పుట్టి పెరిగిన ఊరిపై మమకారంతో ఉపాధ్యాయ దంపతులు తమ గ్రామంలో రాళ్ళు, గుంతలతో నిండి ఉన్న అంతర్గత రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మండలంలోని ఆర్కూరు గ్రామానికి చెందిన పాయం కన్నారావు, ఆయన సతీమణి కుమారి ఇరువురు వృత్తి రీత్యా ఉపాధ్యాయులు. కన్నారావు శ్రీరాంపురం ఎంపిపిఎస్ పాఠశాలలోను, కుమారి రేపాక కాలనీ ఎంపిపిఎస్ పాఠశాలలోను ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆర్కూరులోని వారి ఇంటి నుండి ప్రధాన వీధికి వెళ్ళే 40 మీటర్ల పొడవున ఉన్న అంతర్గత వీధి రహదారి నడవటానికి సైతం వీలులేకుండా ఉంది. దీంతో కన్నారావు తమ సొంత డబ్బులు లక్ష రూపాయలు వెచ్చించి 40 మీటర్ల పొడవున సిసి రోడ్డు వేయించారు. పంచాయతీరాజ్ శాఖ చేయాల్సిన ఈ పనిని ఉపాధ్యాయుడు కన్నారావు తన సొంత డబ్బులతో ఆదర్శంగా నిలిచారు. దీంతో కన్నారావు మాస్టర్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు. కన్నారావు మాస్టర్ ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ మండల ప్రధాన కార్యాదర్శిగా పనిచేస్తూ సంఘం తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

దగ్గరుండి సిసి రోడ్డు వేయిస్తున్న ఉపాధ్యాయుడు పాయం కన్నారావు

జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున జెన్ డైరెక్టర్ సత్యనారాయణ

'మాచ్‌ఖండ్' జనరేటర్ మరమ్మతు చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా సంయుక్త రాష్ట్రాలు నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్కో డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల మరమ్మతుకు గురైన టిపి డ్యామ్ ట్రాస్ రాక్ లైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ జెన్కో డైరెక్టర్ మాట్లాడుతూ, 6వ నెంబర్ జనరేటర్ గత ఆరు నెలలుగా మరమ్మత్తుకు గురైనా ఇంతవరకు వినియోగం లోకి తీసుకొని రాకపోవడంపై ప్రాజెక్టు ఉద్యోగులు, కార్మికులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మరమత్తు పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే వేసవి నాటికి పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ ఉద్యోగులకు సూచించారు. గత ఆరు నెలలుగా నిలిచిన ఆరవ నెంబర్ జనరేటర్ మరమ్మతులు చేయడానికి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని ఆయన ప్రశ్నించారు.

నిలిచిన ఆరో నెంబర్ జనరేటర్‌ను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు పనులు పూర్తి చేయాలని ఆయన ప్రాజెక్ట్ ఉద్యోగులకు సూచించారు. విద్యుత్ కేంద్రంలో వివిధ విషయాలపై ఉద్యోగులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్ట్‌లో ఉద్యోగులు, కార్మికుల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ బి.శ్రీధర్, ఎస్ఈ కె.వి నాగేశ్వరరావు, ఈఈ టెక్నికల్ మోతుగూడెం, బాలకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్, పిఒలను కలిసిన

పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.గణపతి శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జనరల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై చర్చించారు. విశాఖ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆయనకు అల్లూరి జిల్లా జనరల్ మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంచింగిపుట్టు మండలానికి చెందిన స్థానిక గిరిజనుడు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అయ్యేందుకు కృషి చేశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గణపతి

గ్రిడ్ సమతుల్యతకు పంపు స్టోరేజ్ ప్రాజెక్టు అవసరం

- డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తికి చర్యలు

- ఎపి జెన్‌కో హైడెల్ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి -సీలేరు

గ్రిడ్ సమతుల్యం చేయడానికి సీలేరులో నెలకొల్పనున్న 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు (టన్నేల్ ప్రాజెక్టు) ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏపీ జెన్కో హైడెల్ డైరెక్టర్ ఎంవి. సత్యనారాయణ వెల్లడించారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం సందర్శనలో భాగంగా శనివారం సీలేరు వచ్చిన సత్యనారాయణ సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ బి.శ్రీధర్, ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఇతర ఇంజనీరులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఏపీ జెన్కో అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ అవసరాల నిమిత్తం సీలేరులో నూతనంగా నిర్మాణం తలపెట్టబోతున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై ఏప్రిల్ 1న సీలేరులో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ప్రాజెక్టుపై సమగ్ర డిపిఆర్‌ఓ కేంద్ర ప్రభుత్వం సిజిఐకి నివేదించగా, దానిని ఆమోదించడం జరిగిందని చెప్పారు. టెక్నో ఎకనామిక్ క్లియరెన్స్ ఈనెల చివరినాటికి, ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం ఎన్విరాన్మెంట్ అనుమతులు తొందరిలోనే వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వేసవి సమీపిస్తుండడంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతుందన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 230 నుంచి 240 మిలియన్ యూనిట్లు విద్యుత్ డిమాండ్ ఉందని, అందుకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రైవేట్ రంగం నుండి కూడా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏపీ జెన్కో పరిధిలో కొత్త ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నామని, ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ప్రాజెక్టులో 800 మెగావాట్ల సామర్థ్యం గల ధర్మల్ జల విద్యుత్ కేంద్రం, విజయవాడలో నార్ల తాతారావు ధర్మల్ పవర్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో 12 యూనిట్లతో జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, 2024 నాటికి మొదటి యూనిట్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్క యూనిట్ 150 మెగావాట్లు సామర్థ్యంతో రెండు యూనిట్లు నిర్మాణానికి ప్రతిపాదించామని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ జులైలో జరిగిందని తెలిపారు. ఎన్విరాన్మెంట్ అనుమతులు తొందర్లో వస్తాయని, ఆ వెంటనే పనులు చేపడతామని చెప్పారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో సాంకేతికపరమైన సమస్యల వల్ల రెండు రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని, లోపాలను సవరించి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, బాబురావు, ప్రభాకర్, ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి జెన్‌కో హైడెల్ డైరెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీలేరు పెద్దలు

పంపు స్టోరేజ్ ప్రాజెక్టుపై అపోహలొద్దు

సీలేరులో నెలకొల్పనున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వలన ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తవని, ఎవరో అపోహలు చెందవద్దని ఏపీ జెన్కో హైడిల్ డైరెక్టర్ ఎంవి సత్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి ఆధ్వర్యాన సీలేరు గ్రామ పెద్దలు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు రావడం వల్ల మార్కెట్, ఇళు ,, దుకాణాలకు నష్టం వాటిల్లుతుందని ప్రజల్లో అపోహలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే తాము పక్కాభవనాలు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని, ప్రాజెక్టులోని ఉద్యోగ అవకాశాలలో స్థానిక యువకులకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మంచినీరు, వైద్యం వంటి తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. దీనికి స్పందించిన సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుని భూ అంతర్భాగంలో 150 అడుగులు లోతు నుంచి సొరంగ మార్గం ద్వారా ఏర్పాటు చేసి పైపులైన్ నిర్మించడం జరుగుతుందని, దీని వల్ల పొల్యూషన్, ఇతర సమస్యలు ఏమీ ఉండవని తెలిపారు. ఏప్రిల్ 1న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో మీకున్న అనుమానాలపై లిఖిత పూర్వకంగా విన్నవిస్తే నివృత్తి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఇన్‌ఛార్జి సర్పంచ్ వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్, టిడిపి నాయకులు నక్క తిరుమలరావు, ఆదివాసీ నాయకులు కోడా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

రాజవొమ్మంగి గ్రామ శివారు రాజవొమ్మంగి, నర్సీపట్నం వైపు రహదారికి ఆనుకొని ఉన్న రిజర్వ్ పారెస్ట్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై శనివారం ఎస్సై నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు సేస్తున్న కొండపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన రాజనరేంద్రను పట్టుకొని అరెస్ట్ చేశారు. ఆయన నుండి 10 లీటర్ల నాటు సారా, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి అడ్డతగల కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై నరేంద్ర ప్రసాద్ శనివారం రాత్రి తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థల రక్షణకు పాటుపడతా..

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

హెచ్‌పిసిఎల్ గేటు వద్ద ప్రచారంలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి -ములగాడ: స్థానికులకు ఉపాధి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు పాటుపడతానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హెచ్‌పిసిఎల్ మెయిన్ గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులు, పట్టభద్రుల ఓటర్లను స్వయంగా కలిసి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్, ఐఒసి, బిపిసిఎల్, ఇతర ఆయిల్ పరిశ్రమలతోపాటు షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, ఎల్‌ఐసి, బ్యాంకులు, రైల్వేలు, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులు, ఉద్యోగులకు సకాలంలో పిఆర్‌సి అమలు, వంటి సమస్యలపై దృష్టి పెడతానన్నారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధానకార్యదర్శి కెఎస్ సత్యనారాయణ, ప్రభాకర్, ఎన్. రాజేష్‌నాయుడు, హరికృష్ణ నాగచైతన్య, పబ్లిక్ కోఆర్డినేషన్ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, జోన్ నేతలు పి.పైడిరాజు, వి.బాబూరావు, వాసు, ఎం.కృష్ణారావు, వై.గంగాధర్, ఏసుబాబు శ్రీను, సుభానీ పాల్గొన్నారు.

షిప్‌యార్డులో...

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ, ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు తమసంపూర్ణ మద్దతు ఉంటుందని షిప్‌యార్డు ఉద్యోగ, కార్మిక సంఘాలు స్పష్టంచేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, ప్రజాకార్మిక విధానాలపై శాసనమండలిలోనూ, బయట ప్రశ్నించి పోరాడ గల సత్తా పిడిఎఫ్అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మాత్రమే ఉందని తామంతా సంపూర్ణంగా విశ్వసిస్తూ మద్దతు ప్రకటిస్తున్నామని షిప్‌యార్డు సిఐటియు, ఎఐటియుసి, టిఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్ ఇతర యూనియన్ల నేతలు వెల్లడించారు. డాక్టర్ రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి శాసనమండలికి పంపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎస్‌ఎన్.రాజు, ఎస్.ప్రసాద్, ఎఐటియుసి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గోవింద్, బి.హరినాథ్ టియన్‌టియుసి జనరల్ సెక్రటరీ రాజా రమేష్ , గున్నయ్య, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ కె.బాబురావు, కెకె .గోవిందరాజు, డి. మధుసూదనరావు,జి. సత్యనారాయణ ఉన్నారు.

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సింహాచలం ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి. ప్రజా సమస్యలపై నినదించే సత్తా ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ విజయంతో పంచగ్రామాల భూసమస్యకు పరిష్కారం లభిస్తుందని బ్యానర్లలో పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపైనా, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, విభజన హామీల అమలుకు రమాప్రభ గెలుపు అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.

ఆరిలోవ: ఉత్తరాంధ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పెట్టుకుని చట్టసభల్లో ప్రజావాణిని సమర్ధవంతంగా వినిపించగలిగే సత్తా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థుల తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. శనివారం సిఐటియు, ఐద్వా, పెన్షనర్ల అసోసియేషన్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆరిలోవ, టిఐసి పాయింట్ వద్ద గోడపత్రికలను ప్రదర్శిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ అధికార పక్షమో, విపక్షమో కాకుండా ప్రజల పక్షాననిలబడే అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, ఎస్.రంగమ్మ, వి.కృష్ణమూర్తి, వి.కాంతం, ఐసిహెచ్.నాయుడు, కె.మోహనరావు, రత్నం, ఎ.రమణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సింహాచల పరిసర ప్రాంతాల్లో సిపిఎం, సిఐటియు సభ్యులు విస్తృతంగాప్రచారాన్ని చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకుల వద్దకు వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి రమాప్రభను గెలిపించాలని కోరారు.

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల మద్దతు

కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌లు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించాయని యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. వెంకటరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద డాక్టర్ రమాప్రభకు మద్దతు తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌తో సహా దేశాన్ని అమ్మేస్తున్న బిజెపి, గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానికి అమ్మేసిన వైసిపి ఒట్లు అడిగే హక్కును కోల్పోయాయన్నారు. చట్టసభలలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. క్లాప్ డ్రైవర్స్, నీటి సరఫరా కార్మిక నాయకులు కుమార్, సురేష్, అశోక్, రవి, రాంబాబు, చిన్నబాబు, ఈశ్వరరావు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ప్లకార్డుల ప్రదర్శన

డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమస్యలు, ముఖ్యంగా ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడగలిగే డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు నగర నాయకులు జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మండలంలోని వాడవాడలా ప్రజా సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. మండలంలోని సబ్బవరం సాయి నగర్ కాలనీ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఉపాధ్యాయులతో జరిగిన ప్రచారంలో రాష్ట్ర ఐద్వా అధ్యక్షురాలు బి. ప్రభావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని, ఆ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ నాయకులు మొల్లేటి గౌరీశ్వర రావు, ఎర్ర సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోమ నాయుడు పట్టభద్రులను కోరారు. అచ్చుతాపురంలో ప్రైవేటు పాఠశాలలు, గ్రంథాలయంలో శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కె తిరుపతిరావు, ఆర్ రాము, జాగర్పు నర్సింగరావు, రాజాన జగదీష్, బి రామ్ కుమార్, బత్తిన రవిశంకర్, బి రంగారావు, సిహెచ్ తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : డాక్టర్ రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ అధ్యక్షుడు దిల్సన్ బాబు, గాలకొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సిఐటియు మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం జీకే వీధి మండలం రేంతాడలో ప్రచారం చేశారు. ఆర్‌వి నగర్, జీకే వీధిలో పట్టభద్రులను కలిసి రమాప్రభకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

పాడేరు: పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పీ అప్పలనర్స పిలుపునిచ్చారు. పాడేరులోని కాఫీ హౌస్ ప్రాంగణం ఎదుట శనివారం ఆదివాసీ మాతృభాష విద్యావాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలు, హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని, జిఓ 3 రద్దు చేసి నేటికి రెండున్నర సంవత్సరాలకు పైబడినా ప్రభుత్వం చట్టబద్ధత కల్పించలేదన్నారు. ప్రత్యేక డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయలేదని, 1/70 చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. పీసా గ్రామసభల కమిటీ పున: నియమాకానికి ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు.అటవీ సంరక్షణ చట్టం 1980ను సవరించి హైడ్రో పవర్ ప్రాజెక్టు, మైనింగ్ల పేరుతో అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అడవులు అమ్మకానికి పెట్టడం తగదన్నారు. విద్య, వైద్యం. ఉపాధి లేక గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భాషా వాలంటీర్ల రెన్యువల్‌కు అనేక రూపాల్లో పోరాటాలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుందని తెలిపారు.ఏజెన్సీలో వైసిపికి ఓట్లువేసి గెలిపించినప్పటికీ గిరిజన సమస్యలను, ఆదివాసీ ప్రజల వాణిని వినిపించలేకపోతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ ఉద్యమ వాణిని శాసన మండలిలో సమర్ధవంతంగా వినిపించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఆదివాసీ మాతృభాషా విద్యావాలంటీర్లు, గిరిజన కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల రెన్యువల్స్, జిఓ 3 చట్టబద్ధతకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటికే కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై గొంతు వినిపించే కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాషా వాలంటీర్ల సంఘం నాయకులు శర్బునాయుడు, శ్రీను, కుమారి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు, 500 మంది భాషా వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స

హుకుంపేట: పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు కోరారు. మండలంలోని తాడేపుట్టు పంచాయతీ ఉర్రడా బొడ్డ పుట్టు గ్రామంలో ప్రచారం చేపట్టారు. రమాప్రభకు ఓటు వేయాలని ఉద్యోగస్తులు, గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కోరారు. వైసిపి పార్టీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

కొత్తకోట: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ రావికమతం మండలం దొండపూడి, కొమిరి, కవ్వగుంట తదితర గ్రామాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త రమాప్రభను గెలిపించాలని కోరారు. ఇప్పటికీ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, రమాప్రభను గెలిపిస్తే వీటి పరిష్కారానికి కృషి చేస్తారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, సిపిఐ మండల కార్యదర్శి జోగిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం నేత ఎర్రయ్య, పాడి అప్పారావు, బూరిగ నూకరత్నం, సొలం వరలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: వివిధ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ శనివారం రోలుగుంటలో ప్రజా సంఘాల నేతలు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త రమాప్రభను గెలిపించాలని కోరారు. జిల్లాల్లో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, రమాప్రభను గెలిపిస్తే అవన్నీ పరిష్కారమవుతాయని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మడ్డు శ్రీరామ్మూర్తి, ప్రజాశక్తి బాధ్యులు శంకరరావు, ఏపీ గిరిజన సంఘం నేత ఎర్రయ్య, పాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని బిబి.పట్నం, రాజన్నపేట గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభను గెలిపించాలని శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్మిక, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి కోరారు. ఈ కార్యక్రమంలో మడ్డు శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపిటిసి పోతురాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

152 మందికి కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కాకినాడ అంజూ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక ఎంపిపి పాఠశాల ఆవరణలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 152 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 42 మందికి క్యాటరాక్ట్ ఉన్నట్టు గుర్తించి వారికి ఉచిత ఆపరేషన్ నిమిత్తం కాకినాడ అంజు హాస్పిటల్ తరలించినట్లు కంటి వైద్యులు డాక్టర్ తేజ తెలిపారు. సుమారు 40 మందికి కళ్ళజోళ్ళు అవసరమని గుర్తించామన్నారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎనీమా, మేనేజర్లు స్వామి వందనం, సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసులది కపటి ప్రేమ

- మావోయిస్టు నాయకులు గణేష్

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు నాయకుడు కాకూరు పండన్న అలియాస్ జగన్ తల్లి పట్ల పోలీసులు చూపింది కపట, కుటిల ప్రేమ అని మావోయిస్టు పార్టీ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ శనివారం చింతపల్లి విలేకరులకు పంపిన లేఖలో పేర్కొన్నారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామానికి చెందిన జగన్ తల్లి సీతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం, పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మావోయిస్టు నేత ఈ లేఖను శనివారం విడుదల చేశారు. జగన్ మాతృమూర్తి మరణానికి తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు బాధలో దు్ఖంలో కన్నీళ్ళతో పాలుపంచుకొని సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాలుగు దశాబ్దాల క్రితం ఫారెస్ట్ అధికారులు, వడ్డీ వ్యాపారులు జగన్ కుటుంబాన్ని దోపిడీ దౌర్జన్యాల గురి చేయడంతో వారు అత్యంత కటిక పేదరికంలో జీవించినట్లు తెలిపారు. సీతమ్మ తన చిన్న కుమారుడు పండన్నను విప్లవ ఉద్యమంలోకి పంపిందని గుర్తు చేశారు. విప్లవ ఉద్యమంలో కొనసాగాలని సీతమ్మ బహిరంగ ప్రకటించిందని, ఆమె బతికున్నంత కాలం పోలీసు ఒత్తిళ్లను ఎదిరించి నిలబడిందని పేర్కొన్నారు. కాబట్టి అంత్యక్రియలకు పోలీసులు హాజరై ఆ సందర్భంగా కూడా వర్గ స్వభావాన్ని ప్రదర్శించే కాకూరి పాండన్న లొంగిపోవాలని చెప్పడం ద్వారా వారి కుటిల ఎత్తుగడలు బహిర్గతమయ్యాయని లేఖలో పేర్కొన్నారు. పోలీసుల కపట ప్రేమను సీతమ్మ కుటుంబం తిరస్కరించవలసిందిగా కోరుతున్నట్లు పేర్కొన్నారు.

బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భారత రాష్ట్ర సమితి నాయకులు, ఎమ్మెల్సీ కవితపై తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని ఖండిస్తూ శనివారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బిఆర్ఎస్ విశాఖపట్నం నాయకుడు బొడ్డేటి వేణు నాయకత్వంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. లిక్కర్ స్కామ్‌లో కవిత ఇరుకుంటే ముద్దు పెట్టుకోవాలా అంటూ బండి సంజయ్ అనడం మహిళ లోకానికి అవమానకరం అన్నారు.

అమిత్ షా మహిళలను కించపరిచే విధంగా మాట్లాడమని ఆదేశాలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. బిజెపి నాయకులను ఢిల్లీ వరకూ పరిగెట్టేలా బిఆర్ఎస్ శ్రేణులు తరిమికొట్టే పతిస్థితి తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి సిద్ధపడగా 2 టౌన్ పోలీసులు అడ్డుకున్నారు.

నాటువైద్యంతో ప్రాణాలకు ముప్పు

పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో సుజనకోట గ్రామ సచివాలయ పరిధి కుమ్మరిపుట్టులో ఇంటింటికి వైద్య సేవలు అందించినట్లు కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.శిరీష తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ, డయేరియా, టీబి, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు.ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.జ్వరాల బారిన పడితే ఆస్పత్రులకు వచ్చి వైద్య సేవలు పొందాలని, గ్రామాల్లో నాటువైద్యులను ఆశ్రయించి ప్రాణ నష్టం తెచ్చుకోకూడదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిహెచ్ఈఓ కే.సుబ్రహ్మణ్యం, ఏంఎల్‌హెచ్‌పి ఎం.లలిత, ఎంపిహెచ్ఎ జె.అశోక్ కుమార్, వైద్య సిబ్బంది సుశీల, మల్లేశ్వరి పుణ్యవతి, వేణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేత

సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన గిరిజనులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో వివిధ స్వయంఉపాధి, వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన 540 మందికి శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. టైలరింగ్, కటింగ్, డ్రెస్‌మేకింగ్‌లో సుమారు 200 మందికి, విస్తరాకుల తయారీలో 260 మందికి, ఇంటికి అవసరమైన రసాయనాలు తయారీలో 80 మందికి శిక్షణనిచ్చారు. అల్లూరి జిల్లాలో నమ్మిడివలస, వలసి, బల్లిమామిడి, మాలివలస, చంపి, పాకనకుడి మలిసింగారం, కొడిమ్మా, శివలింగపురం, గడ్డంపుట్టు తుంపాడ, రాములపుట్టు, వర్ధన పల్లి, కడలి గిరిజన గ్రామాలకు చెందిన వీరికి రూ.19.98 లక్షల వెచ్చించి జన శిక్షణ సంస్థాన్ ద్వారా శిక్షణను అందించినట్లు డీజీఎం రమణారావు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమాలు, ఫిబ్రవరిలో ముగియగా, శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన దోనెలపాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బీరబోయిన సుబ్బారావు, అనారోగ్యంతో మృతి చెందిన రాజవొమ్మంగి గ్రామానికి చెందిన వజ్రపు చిన్నబ్బాయి మాస్టారు కుటుంబ సభ్యులను శనివారం సాయంత్రం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, మండల ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ తదితరులు పరామర్శించారు,

ఉపాధ్యాయుల మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు బుడమ బాబూరావు, సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, ఆదివాసీ నాయకులు వి చిన్నబ్బాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న గిరిజన సంఘం నేతలు

మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని వెట్టిచెలకలు గ్రామంలో ప్రజలు రహదారి, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సాదల విద్యా సాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వెట్టిచెలకలు గ్రామంలో ప్రతి ఇంట్లో సర్వే నిర్వహించి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ అధికారులు, గ్రామసచివాలయ అధికార్లు ఎందుకు ఉన్నారో, అసలు ఉన్నారో? లేరో? అర్ధం కావడం లేదని పేర్కొన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా వేసిన ఇంటింటి కుళాయిల్లో చుక్క నీరు కూడా రావడం లేదన్నారు. సిసిడిపి ద్వారా నిర్మించాల్సిన పశువుల షెడ్లు పునాదిలోనే ఆగిపోయాయని తెలిపారు. వెంటనే రోడ్లు, మంచి నీరు, మౌలిక సదుపాయాలు కల్పించక పోతే ఐటిడిఎ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి, సాయిబాబా సుబ్రమణ్యం స్వామి, నవగ్రహాలు ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కోలాహలంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేదాంత ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ రాధికకు

'ఐకాన్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

ప్రజాశక్తి-పిఎం పాలెం: . పిఎం పాలెం వేదాంత హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ రాధికకు రేడియోసిటీ ఐకాన్ ఆఫ్ ఇయర్ 2022-23 అవార్డు లభించింది. రేడియోసిటీ నగరం లో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న అవార్డుల పంపిణీలో భాగంగా ఈ ఏడాది ఒబెస్ట్రిక్ అండ్ గైనకాలజీ విభాగంలో ఉత్తమమైన సేవలు అందించిన వేదాంత ఆసుపత్రి ప్రసూతి వైద్యురాలు డాక్టర్ రాధికకు ఈ అవార్డు లభించింది. నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో జివిఎంసి ప్రధాన కమిషనర్ రాజాబాబు నుంచి డాక్టర్ రాధిక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ సేవల అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.. పిఎం పాలెం, మధురవాడతోపాటు ఇతర ప్రాంతాల రోగులకు వేదాంత ఆసుపత్రిలో ఉత్తమమైన సేవలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా మధురవాడ పరిసరప్రాంతాలలో ఎక్కడా లేనివిధంగా అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ సర్జరీలు వేదాంత ఆసుపత్రిలోనే చేస్తున్నామని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఒత్తిడి, నొప్పి లేని నార్మల్ డెలివరీలు, హైరిస్క్ గర్భిణుల కాన్పులను తమ ఆసుపత్రిలో విజయ వంతంగా నిర్వహిస్తున్నా మని, 24/7 ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలు అందించేందుకు వేదాంద ఆసుపత్రి సిద్ధంగా ఉందన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ రాధికను వేదాంత ఆసుపత్రి ఎండి డాక్టర్ శివ, పీడియాట్రీషియన్ డాక్టర్ ప్రకాశ్ అభినందించారు.

అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ రాధిక

నేటి నుంచి 'గ్లకోమా' వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఈనెల 12 నుంచి 18వరకు జిల్లా వ్యాప్తంగా గ్లకోమావ్యాధి నివారణకు స్క్రీనింగ్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి. విశ్వమిత్ర తెలిపారు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య కళాశాలలో, అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాల్లో రేడియోలు, టీవీలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వారం రోజులపాటు స్క్రీనింగ్ క్యాంపులు, అవగాహన సదస్సులు చేపడతామన్నారు. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, 45ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఏటా సంపూర్ణ కంటి పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా శాశ్వత అంధత్వం రాకుండా నివారించవచ్చన్నారు. జిల్లాలోని పారామెడికల్ సిబ్బంది, ఆప్తమాలజిస్టులు, కంటి ఆసుపత్రి వైద్యులు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటివైద్యశిబిరాలను నిర్వహిస్తామని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విశ్వమిత్ర కోరారు.

కంప్యూటర్ కోడింగ్‌పై 'గీతం'లో హ్యాక్‌థాన్

ప్రజాశక్తి -మధురవాడ: కంప్యూటర్ సైన్స్ కోర్సు అభ్యసించే విద్యార్థులలో కోడింగ్‌పై నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన శనివారం కోడ్ పర్స్యూట్ పేరిట హ్యాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆర్.శిరీష మాట్లాడుతూ ఐటి రంగంలో కోడింగ్‌కున్న ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థులు సంబంధిత అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాంగణ నియామకాలలో గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద ఎత్తున ఎంపిక కావడానికి కోడింగ్‌లో వారి సామర్థ్యమే కారణమన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కోడింగ్‌పై క్విజ్, హ్యాకర్ ర్యాంక్, ర్యాపిడ్ ఫైర్ పోటీలను నిర్వహించారు. కోడింగ్ సమయంలో సమయానికి ఉన్న ప్రాధాన్యత కారణంగా టైమ్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు ఈ పోటీలు ఉపయోగపడ్డాయని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా గీతం విద్యార్థి విభాగం కార్యదర్శి డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఐ అధ్యక్షుడు అభిజీత్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు జోగేశ్వర్, మురళీకష్ణ, ఉదయ ధనుష్ పాల్గొన్నారు.